సోనియా గాంధీపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు

న్యూఢిల్లీ: రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఉద్దేశించి సోనియా గాంధీ చేసిన వ్యాఖ్యల్ని తప్పుబడుతూ, బీజేపీ ఎంపీలు సోమవారం రాజ్యసభలో సభా హక్కుల తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. సోనియా గాంధీపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలంటూ రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌ను కోరారు. గత శుక్రవారం పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించారు. ఈ ప్రసంగం అనంతరం రాష్ట్రపతిని ఉద్దేశించి 'పూర్ లేడీ' అంటూ సోనియాగాంధీ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశం అయ్యాయి. రాష్ట్రపతిని అవమానించేలా వ్యాఖ్యలు చేశారంటూ బీజేపీ ఎంపీలు తమ నోటీస్‌లో ఆరోపించారు. దేశ అత్యున్నత పదవిలో ఉన్నవారి గౌరవాన్ని తక్కువ చేసే విధంగా సోనియా మాట్లాడారని బీజేపీ ఎంపీ ఒకరు ఆరోపించారు.

ప్రయాగ్‌రాజ్‌లో గంగా జలాలు కలుషితం

- మృతదేహాలను నదిలో పడేశారు
- సమాజ్‌వాదీ ఎంపీ జయా బచ్చన్ ఆరోపణ

న్యూఢిల్లీ: ఉత్తర్ ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభ మేళా జరుగుతున్న చోట గంగా నదీ జలాలు కలుషితం అయ్యాయని సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ జయా బచ్చన్ సోమవారం ఆరోపించారు. గత నెల మౌని అమావాస్య సందర్భంగా మహా కుంభ్‌లో సంభవించిన తొక్కిసలాటలో మరణించిన వారి మృతదేహాలను గంగా నదిలోనే పడేయడంతో ఆ జలాలు కలుషితం అయ్యాయని సోమవారం పార్లమెంట్ వెలుపల విలేకరులతో మాట్లాడుతూ ఆమె ఆరోపించారు. మహా కుంభమేళాకు వచ్చే సామాన్య ప్రజలకు యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఎటువంటి ప్రత్యేక ఏర్పాట్లు చేయడం లేదని ఆమె విమర్శించారు.

పనామా కెనాల్‌ను స్వాధీనం చేసుకుంటాం!

- త్వరలో శక్తివంతమైన చర్య
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్
- చైనా పెత్తనంపై ఆగ్రహం
- చైనాతో బీఆర్ఐ ఒప్పందం పునరుద్ధరించబోమన్న పనామా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: పనామా కెనాల్‌పై చైనా ప్రభావం, నియంత్రణపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలోనే 'ఒక శక్తివంతమైన చర్య' ఉంటుందని ఆదివారం ట్రంప్ ప్రకటించారు. పనామా కెనాల్‌పై చైనా ప్రభావం పెరుగుతున్నదని, అమెరికా, పనామా మధ్య కుదిరిన ఒప్పందాన్ని పనామా ప్రభుత్వం ఉల్లంఘించిందని ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ట్రంప్ ఆరోపించారు. పనామా కెనాల్ నిర్వహణను అమెరికా ప్రభుత్వం వాపసు చేసుకుంటుందని ఆయన హెచ్చరించారు. పనామాకు అత్యంత కీలకమైన కెనాల్‌ను మూర్ఖంగా ఇచ్చివేశారని ఆయన అమెరికా గత పాలకులను విమర్శించారు. కెనాల్‌ను అమెరికాకు తిరిగి అప్పగించని పక్షంలో 'శక్తివంతమైన చర్య' జరుగుతుందని ట్రంప్ వెల్లడించారు. అట్లాంటిక్, పసిఫిక్ మహాసముద్రాలను కలిపే కీలకమైన పనామా జలమార్గాన్ని చైనాకు ఇవ్వలేదని, అమెరికా, పనామా మధ్య జరిగిన ఒప్పందం ఉల్లంఘన జరిగిందని ట్రంప్ అన్నారు. పనామా కెనాల్‌ను ఆధునిక ప్రపంచ వింతగా ఆయన అభివర్ణించారు. అమెరికా నిర్మించిన ఈ కెనాల్ 1914లో ప్రారంభమైందని, బార్బడాస్, జమైకాతోపాటు ఇతర కరీబియన్ దేశాల నుంచి వచ్చిన వేలాదిమంది ఆఫ్రికన్ కార్మికుల స్వేదంతో నిర్మించిన ఈ కెనాల్‌ను 1999లో అప్పటి అమెరికా అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ పనామాకు అప్పగించారని ట్రంప్ చెప్పారు. పనామా కెనాల్‌ను స్వాధీనం చేసుకోవడానికి సైనిక బలగాలు అవసరమని తాను భావించడం లేదని ట్రంప్ చెప్పారు. పనామా ప్రభుత్వం తప్పు చేసిందని, ఒప్పందాన్ని ఉల్లంఘించిదని ట్రంప్ చెప్పారు. పనామా కెనాల్‌ను చైనా నిర్వహిస్తోందని, దాన్ని చైనాకు తాము ఇవ్వలేదని, పనామాకు మాత్రమే ఇచ్చామని ఆయన స్పష్టం చేశారు. 1977లో చేసుకున్న ఒప్పందం మేరకు పనామా కెనాల్‌పై నియంత్రణను పనామాకు 1999లో అమెరికా అప్పగించింది. అయితే జలమార్గం తటస్థంగా ఉండాలని ఇరుదేశాల మధ్య అవగాహన కుదిరింది. అయితే కెనాల్ నిర్వహణ కార్యకలాపాలకు అంతర్గత ఘర్షణల వల్ల కానీ, విదేశీ శక్తుల వల్ల కాని ఆటంకం ఏర్పడిన పక్షంలో అమెరికా సైనికపరంగా జోక్యం చేసుకోవచ్చని ఒప్పందంలో ఉంది. అమెరికా నియంత్రణలో ఉన్న రోజుల కంటే ఇప్పుడు భారీ మొత్తంలో సరకు రవాణా ఈ కెనాల్ మీదుగా సాగుతున్నది.

దిగొచ్చిన పనామా

ఇదిలా ఉండగా, పనామా కెనాల్‌ను తిరిగి తమ నియంత్రణలోకి తెచ్చుకుంటామని ట్రంప్ చేసిన తాజా హెచ్చరికలతో పనామా దిగొచ్చింది. చైనాకు చెందిన బెల్ట్ అండ్ రోడ్డు ప్రాజెక్టు సంబంధించి 2017లో కుదిరిన ఒప్పందాన్ని పునరుద్ధరించుకోబోమని పనామా అధ్యక్షుడు జోస్ ఆల్ ములినో ఆదివారం ప్రకటించారు. అమెరికా విదేశాంగ మంత్రి రుబియోతో జరిగిన సమావేశంలో ములినో ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. పనామా కెనాల్‌పై చైనా నియంత్రణను తగ్గిస్తారా లేక అమెరికా నుంచి ప్రతీకార చర్యలను ఎదుర్కొంటారా అంటూ రుబియో చేసిన హెచ్చరికతో ములినో తమ నిర్ణయాన్ని వెల్లడించారు. ప్రపంచ వాణిజ్యానికి అత్యంత కీలకమైన పనామా కెనాల్ జలమార్గం నిర్వహణ బాధ్యతలను తామే తిరిగి చేపతామంటూ అమెరికాలోని కొత్త ప్రభుత్వం తీసుకువస్తున్న ఒత్తిడిని ములినో ప్రతిఘటించారు. రుబియోతో సమావేశమైన అనంతరం ములినో విలేకరులతో మాట్లాడుతూ కెనాల్‌ను తిరిగి చేపట్టడం లేదా బలాన్ని ఉపయోగించడం వంటి బెదిరింపులేవీ ఈ సమావేశంలో రాలేదని చెప్పారు. పనామా కెనాల్‌లో చైనా ప్రమేయంపై అమెరికా వ్యక్తం చేసిన అనుమానాలను తాను నివృత్తి చేసినట్టు ములినో చెప్పారు. చైనాతో తమకున్న బీఆర్ఐ ఒప్పందం త్వరలోనే ముగియనున్నట్టు ఆయన వెల్లడించారు. ఇది అమెరికా హెచ్చరికల ప్రభావంగా విశ్లేషకులు భావిస్తున్నారు. రుబియో తొలి విదేశీ పర్యటనను ప్రస్తావిస్తూ ఈ పర్యటన తమ రెండు దేశాల మధ్య కొత్త సంబంధాలను నిర్మిస్తుందని, పనామాలో అమెరికా పెట్టుబడుల పెంపుదలకు తోడ్పడుతుందని ములినో ఆశాభావం వ్యక్తం చేశారు. ట్రంప్ వరుస హెచ్చరికల నేపథ్యంలో పనామా సార్వభౌమత్వానికి వచ్చిన ప్రమాదమేమీ లేదని ములినో స్పష్టం చేశారు.

నిరుద్యోగాన్ని మేమూ పరిష్కరించలేకపోయాం

- వేగంగా ఆర్థిక వృద్ధి జరిగినా నిరుద్యోగం తగ్గలేదు
- ఈ సమస్యను యూపీఏ, ఎన్డీఏ పరిష్కరించలేదు
- పార్లమెంటు సాక్షిగా అంగీకరించిన రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: దేశంలో నిరుద్యోగ సమస్యను ఎన్డీఏతో పాటు యూపీఏ సైతం పరిష్కరించలేకపోయాయని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అంగీకరించారు. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానం మీద జరిగిన చర్చలో సోమవారం ఆయన లోక్‌సభలో మాట్లాడారు. 'ఆర్థికంగా వేగంగా వృద్ధి చెందినప్పటికీ మనం నిరుద్యోగ సమస్యను సరిగ్గా పరిష్కరించలేకపోయాం. దేశ యువతకు ఉద్యోగాల విషయంలో యూపీఏతో పాటు ఇప్పటి ఎన్డీఏ ప్రభుత్వం స్పష్టమైన జవాబు ఇవ్వలేకపోయాయి' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. తయారీ రంగంలో 2014లో భారతదేశ వాటా 15.3 శాతం ఉండగా, ఇవాళ 12.6 శాతానికి తగ్గిపోయిందని, ఇది 60 ఏండ్ల కనిష్ఠమని ఆయన అన్నారు. తాను ప్రధాని మోదీని బదనాం చేయడం లేదని, ఆయన ఎలాంటి ప్రయత్నాలు చేయలేదని చెప్పడం న్యాయం కాదని అన్నారు. 'మేక్ ఇన్ ఇండియా' మంచి ఆలోచనే అయినప్పటికీ ప్రధాని మోదీ విఫలమయ్యారని ఆరోపించారు. కాగా, రాష్ట్రపతి ప్రసంగంలో ప్రభుత్వ కార్యక్రమాల జాబితా మాత్రమే ప్రసంగంలో ఉందని అన్నారు.

ట్రంప్ అపాయింట్‌మెంట్ కోసమే జైశంకర్ అమెరికా పర్యటన

కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ అమెరికా పర్యటనపై రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. 'మన దేశంలో తయారీ రంగం బలంగా ఉంటే, సాంకేతికతలపై మనం పని చేస్తూ ఉంటే మన ప్రధానమంత్రికి ఆహ్వానం తెచ్చేందుకు మూడుసార్లు అమెరికాకు విదేశాంగ శాఖ మంత్రిని పంపాల్సిన అవసరం లేదు. అమెరికా అధ్యక్షుడే వచ్చి ప్రధానిని ఆహ్వానిస్తారు' అని రాహుల్ వ్యాఖ్యానించారు. రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆయనపై హక్కుల తీర్మానం పెట్టేందుకు సిద్ధమవుతున్నది. రాహుల్ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా భారత్ ప్రతిష్ఠను దిగజార్చేలా ఉన్నాయని మంత్రి జైశంకర్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. తన పర్యటనలో ఆహ్వానాల గురించి ఎలాంటి చర్చలు జరపలేదని అన్నారు.

పార్లమెంటును కుదిపేసిన కుంభమేళా తొక్కిసలాట

మహా కుంభమేళాలో తొక్కిసలాట అంశం పార్లమెంటు ఉభయసభలను కుదిపేసింది. ప్రశ్నోత్తరాల సమయాన్ని వాయిదా వేసి, ఈ దుర్ఘటనపై చర్చ జరపాలని విపక్ష సభ్యులు లోక్‌సభలో పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మృతుల జాబితా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కొంతసేపు సభ నుంచి వాకౌట్ చేసిన కాంగ్రెస్, తృణమూల్, డీఎంకే, ఎస్పీ ఎంపీలు తర్వాత సభకు హాజరయ్యారు. 'ఇప్పటికీ తొక్కిసలాటలో ఎంత మంది మరణించారనే సంఖ్య తెలియదు' అని డీఎంకే ఎంపీ కనిమొళి పేర్కొన్నారు. 'మార్చురీలో ఉన్న మృతదేహాల సంఖ్యకు, ఘటనలో ఆచూకీ కోల్పోయిన వారి సంఖ్యకు మధ్య తేడా ఉంది' అని తృణమూల్ ఎంపీ కకోలీ ఘోష్ పేర్కొన్నారు. కాగా, రాజ్యసభలోనూ విపక్ష సభ్యులు ఇచ్చిన నోటీసులను చైర్మన్ జగ్‌దీప్ ధనకడ్ తిరస్కరించారు. దీంతో విపక్ష ఎంపీలు వాకౌట్ చేశారు.

ఆవు @ 40 కోట్లు

కాసుల పంట పండించిన 'నెల్లూరు' జాతి గోవు

బ్రెజిల్‌లో రికార్డు ధర • గిన్నిస్ బుక్‌లో చోటు

బ్రెజిలియా, ఫిబ్రవరి 3: ఆవు పంటలు పండించడం చూశాం కానీ, కాసుల పంట పండించడం ఎప్పుడైనా చూశా రా? బ్రెజిల్‌లో జరిగిన వేలంలో ఓ గోవు అత్యధిక ధరకు అమ్ముడుపోయి రికార్డు సృష్టించింది. ఏకంగా 4.8 మిలియన్ డాలర్లు (సుమారు రూ.40 కోట్లకు పైగా) ధర పలికి ఔరా అనిపించింది.

1101 కిలోల బరువు

శ్రేష్ఠమైన జాతి, నాణ్యత, మంచి లక్షణాలు కలిగిన ఆవులకు ఎక్కువ డిమాండ్ ఉంటుంది. సాధారణంగా ఇవి ఎక్కువ ధర పలుకుతాయి. జపాన్‌కు చెందిన వాగ్యు, మన దేశంలో బ్రాహ్మణ్ పేరు గల ఆవులకు గతంలో రికార్డు ధరలు దక్కాయి. తాజాగా బ్రెజిల్‌లోని మినాస్ గెరైస్‌లో జరిగిన వేలంలో నెల్లూరు జాతికి చెందిన వియాటినా-19 అనే ఆవు 4.8 మిలియన్ డాలర్లకు అమ్ముడుపోయి కాసుల పంట పండించింది. ఇది సుమారు 1,101 కిలోల బరువు ఉండటం విశేషం. సాధారణంగా ఇదే జాతికి చెందిన ఆవుల కంటే దీని బరువు రెట్టింపు కావడం గమనార్హం. వియాటినా-19 అత్యధిక ధర పలికిన ఆవుగా గిన్నిస్ బుక్‌లో చోటు దక్కించుకుంది. అంతేకాదు, గతంలో కండరాల నిర్మాణం, అత్యంత అరుదైన జన్యువులు కలిగి ఉన్నందుకు గానూ 'ఛాంపియన్స్ ఆఫ్ ది వరల్డ్'లో 'మిస్ సౌత్ అమెరికా' పురస్కారమూ పొందింది. పశు సంపద పెంచేందుకు గానూ వియాటినా-19 ద్వారా భారీగా వ్యాపారం జరుగుతున్నట్టు సమాచారం. ఈ గోవు అండాలను ప్రపంచ వ్యాప్తంగా ఎగుమతి చేస్తున్నారు.

ఏపీకి చెందిన జాతి

ఈ నెల్లూరు జాతి మన దేశానికి చెందినదే. వీటినే ఒంగోలు జాతి అని కూడా పిలుస్తారు. అధిక ఉష్ణోగ్రతలను తట్టుకునే సామర్థ్యం ఉన్న వీటికి ఉష్ణమండల, ఉప ఉష్ణమండల ప్రాంతాల్లో భారీ డిమాండ్ ఉంది. 1800లలో ఈ జాతి బ్రెజిల్‌కు ఎగుమతి అయ్యాయి. కండరాల నిర్మాణం, రోగ నిరోధక శక్తి ఎక్కువగా ఉండటం వీటిని ప్రత్యేకంగా నిలుపుతున్నాయి.

శునకాల జీవిత కాలాన్ని పెంచే ఔషధం!

అమెరికాలో క్లినికల్ ట్రయల్స్

వాషింగ్టన్: శునకాల జీవితకాలాన్ని పెంచేందుకు అభివృద్ధి చేసిన ఔషధంపై అమెరికాలో క్లినికల్ ట్రయల్స్ జరుగుతున్నాయి. వెటర్నరీ మెడిసిన్‌లో ఇదొక గొప్ప ముందడుగుగా సైంటిస్టులు భావిస్తున్నారు. నాలుగేండ్లపాటు సాగే క్లినికల్ ట్రయల్స్ కోసం శాన్‌ఫ్రాన్సిస్కో లోని 'లాయల్' అనే జంతు ఆరోగ్య సంస్థ పెద్ద సంఖ్యలో కుక్కలను రిక్రూట్ చేసుకుంటున్నది. ఇప్పటికే వెయ్యి శునకాలపై క్లినికల్ ట్రయల్స్ పూర్తికాగా, ఇందుకు సంబంధించి నివేదికను 'ఎఫ్‌డీఏ' ఆమోదానికి పంపినట్టు సంస్థ తెలిపింది. గత కొన్ని వేల సంవత్సరాల్లో మానవుల జీవితకాలం పెరిగినంతగా, శునకాల్లో జీవిత కాలం పెరగలేదు. కుక్కల్లో జీవక్రియ రేటు మానవుల్లో కన్నా వేగంగా ఉండటమే ఇందుకు కారణమని సైంటిస్టులు భావిస్తున్నారు.

కవలల తల్లికి గుండెజబ్బుల ముప్పు ఎక్కువ!



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: ఒక బిడ్డ తల్లితో పోల్చితే.. కవల పిల్లల తల్లికి గుండె సమస్యలు వచ్చే ముప్పు ఎక్కువని తాజా అధ్యయనం తేల్చింది. కవల పిల్లలకు జన్మనిచ్చిన ఏడాది తర్వాత ఆ తల్లి గుండె జబ్బులబారిన పడే అవకాశముందని పరిశోధకులు తెలిపారు. ప్రసవ సమయంలో అధిక రక్తపోటును కలిగిన తల్లులకు ముప్పు ఇంకా ఎక్కువ ఉంటుందని 'రట్‌గర్స్ యూనివర్సిటీ' (అమెరికా) పరిశోధకులు చెబుతున్నారు. 'యూరోపియన్ హార్ట్ జర్నల్' కథనం ప్రకారం, గత కొన్ని దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా కవల పిల్లల జననాలు పెరిగాయి. 2010-2020 మధ్య అమెరికాలోని దవాఖానాల్లో నిర్వహించిన 3.6 కోట్ల ప్రసవాల డాటాను పరిశోధకులు విశ్లేషించారు. గర్భంలో ఇద్దరు శిశువులు ఉండటం.. తల్లి గుండె పనితీరుపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ప్రసవం అనంతరం గుండె పనితీరు మళ్లీ మామూలు స్థితికి చేరుకోవడానికి చాలా సమయం పడుతుందని పరిశోధకుల్లో ఒకరైన డాక్టర్ రూబీ లిన్ చెప్పారు. దీంతో ప్రసవం అనంతరం మొదటి ఏడాది తల్లికి గుండె సమస్యలు వచ్చే ముప్పు ఎక్కువ ఉంటుందని తెలిపారు.

సిద్ధరామయ్యకు బినామీ ఆస్తులు

- బావమరిది పేరుతో భూములు కొన్నారు
- కర్ణాటక సీఎంపై ఆర్టీఐ కార్యకర్త ఫిర్యాదు
- లోకాయుక్త చర్యలు తీసుకోవాలని డిమాండ్

బెంగళూరు : ముడా భూముల కుంభకోణంతో సతమతమవుతున్న కర్ణాటక సీఎం సిద్ధరామయ్యపై తాజాగా బినామీ ఆస్తుల ఆరోపణ వచ్చింది. ఆయన తన బావ మరిది పేరున బినామీ ఆస్తులను కూడబెట్టారని ఆర్టీఐ కార్యకర్త స్నేహమయి కృష్ణ లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. సిద్ధరామయ్య ఇప్పటికే కెసరె గ్రామంలోని 3.16 గుంటల భూమిని పసుపు-కుంకుమ సంప్రదాయం కింద బదిలీ చేశారని.. అయితే ఇప్పుడు అదనంగా ఆయన బావమరిది మల్లికార్జున స్వామి ఒక ఎకరా భూమిని దానం చేశారని ఆయన తెలిపారు. దీనిపై సిద్ధరామయ్య మౌనంగా ఉన్నారని.. ఈ లావాదేవీల వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటని కృష్ణ ప్రశ్నించారు. సిద్ధరామయ్య భార్య పార్వతి కుటుంబ ఆస్తులపైనా, మల్లికార్జున స్వామి సంపాదించిన ఆస్తులపైనా దర్యాప్తు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఒక ఎకరా భూమి కొనుగోలును ముడా డీ-నోటిపై చేయడంపై సిద్ధరామయ్య ప్రభావం ఉందని కృష్ణ వాదిస్తున్నారు. అదే భూమిని అక్టోబర్, 2010లో పార్వతికి దానమిచ్చారు. ఆ తర్వాత నెలకే ఆమె ఆ భూమిని తన కొడుకు యతీంద్రకు బదలాయించారు. ఆ తర్వాత నాలుగు నెలలకే దాన్ని యతీంద్ర మూడో పార్టీకి అమ్మేశారు. లోకాయుక్త ఈ బినామీ బాగోతంపై దర్యాప్తు చేసి తగిన చర్యలు తీసుకోవాలని కృష్ణ డిమాండ్ చేశారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో మరాఠీనే మాట్లాడాలి

మహారాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు

ముంబై: మహారాష్ట్రలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో మరాఠీ మాట్లాడటాన్ని తప్పనిసరి చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ సోమవారం ఆదేశాలు జారీ చేసింది. ఇతర రాష్ర్టాలకు చెందిన వారితో తప్ప కార్యాలయాలకు వచ్చే అందరితో మరాఠీనే మాట్లాడాలని స్పష్టం చేసింది. కార్యాలయాల్లో మరాఠీనే మాట్లాడేలా సైన్‌బోర్డులు పెట్టాలని, కంప్యూటర్లకూ మరాఠీ భాష టైప్ చేసేలా కీబోర్డులు ఉండాలని ఆదేశించింది. ఈ ఆదేశాలు పాటించకపోతే క్రమశిక్షణారాహిత్యంగా భావించి, చర్యలు తీసుకోనున్నట్టు తెలిపింది. ప్రభుత్వ కార్యాలయాల్లో మరాఠీ మాట్లాడకపోతే ఎవరైనా కార్యాలయ ఇంచార్జ్‌కు ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నది.

ఢిల్లీ 'సుల్తాన్' ఎవరో?

- రాజధానిలో ముగిసిన ప్రచారం
- మూడు పార్టీల హోరాహోరీ
- మరోసారి అధికారం కోసం ఆమ్ ఆద్మీపార్టీ ప్రయత్నాలు
- గట్టి పోటీని ఇస్తున్న బీజేపీ
- గత వైభవానికి కాంగ్రెస్ పోరాటం

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో ఎన్నికల ప్రచారపర్వం ముగిసింది. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం కోసం మూడు పార్టీలు తీరిక లేకుండా ప్రచారం చేశాయి. పుష్కరకాలంగా ఢిల్లీని ఏలుతున్న ఆమ్ ఆద్మీ పార్టీ మరోసారి అధికారం కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నది. లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటుతూ అసెంబ్లీ ఎన్నికల్లో చతికిలపడుతున్న బీజేపీ ఈసారి ఆప్‌ను గద్దె దింపేందుకు గట్టిగానే కష్టపడుతున్నది. గత మూడు ఎన్నికల్లో ఓటముల తర్వాత ప్రభావాన్ని కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ ఈసారి గత వైభవాన్ని పొందేందుకు శ్రమిస్తున్నది. దీంతో మూడు పార్టీల మధ్య త్రిముఖ పోరు నెలకొన్నది. దేశ రాజధాని కావడంతో ఢిల్లీ ఫలితాలు దేశ రాజకీయాల్లోనూ కీలకంగా మారనున్నన్నాయి.

కేజ్రీవాల్‌పై విశ్వాసం కొనసాగుతుందా?

2013 నుంచి ఢిల్లీ ఓటర్లు లోక్‌సభ ఫలితాలు ఎలా ఉన్నప్పటికీ అసెంబ్లీకి వచ్చే సరికి కేజ్రీవాల్‌కే సీఎం కుర్చీని కట్టబెడుతున్నారు. ముఖ్యంగా ముస్లిం, దళిత, సిక్కు ఓటర్లలో, మురికివాడల్లో కేజ్రీవాల్‌కు ఆదరణ ఉన్నది. అయితే, ప్రభుత్వ వ్యతిరేకత, అవినీతి ఆరోపణలు, నేతల అరెస్టులు, వలసలు, నగరంలో వాయు, నీటి కాలుష్యం, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల సమస్యలు ఈసారి ఆమ్ ఆద్మీకి మైనస్‌గా మారాయి.

27 ఏండ్ల తర్వాతైనా కమలం వికసించేనా?

ఢిల్లీలో 1998 నుంచి బీజేపీ అధికారానికి దూరంగా ఉంది. ఈసారి కచ్చితంగా విజయం సాధించాలనే పట్టుదలతో బీజేపీ ఉంది. ఇందుకోసం అన్ని అస్త్రాలనూ ఉపయోగిస్తున్నది. గతంలో విమర్శించిన ఆప్, కాంగ్రెస్ నేతలను పార్టీలో చేర్చుకొని టికెట్లు ఇచ్చింది. ఉచితాలకు వ్యతిరేకం అంటూనే ఢిల్లీలో భారీగా హామీలు ప్రకటించింది.

ఈ సారి ఫలితం వన్‌సైడ్ కాదా?

ఈసారి ఫలితాలు భిన్నంగా ఉండొచ్చని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. గత రెండు ఎన్నికల్లో కనిపించిన ఏకపక్ష ఫలితాలు ఈసారి ఉండకపోవచ్చని చెప్తున్నారు. కాంగ్రెస్ సాధించే ఓట్లను బట్టి ఆప్, బీజేపీ గెలుపోటములు ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయని అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ముస్లిం, దళితులు గణనీయంగా ఉన్న 12 స్థానాల్లో ఆప్-కాంగ్రెస్ మధ్యే ప్రధాన పోటీ ఉన్నట్టు చెప్తున్నారు. మిగతా స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ పొందేవి ఆప్ సంప్రదాయ ఓట్లనా? ప్రభుత్వ వ్యతిరేక ఓట్లనా అనేది ఫలితాలను నిర్ణయించడంలో కీలకమని అంచనా వేస్తున్నారు.

కాంగ్రెస్ ప్రభావమెంత?

2013 నుంచి ఢిల్లీలో కాంగ్రెస్ క్రమంగా ప్రభావాన్ని కోల్పోయింది. పోయిన వైభవాన్ని తిరిగి పొందేందుకు ఈసారి కాంగ్రెస్ గట్టిగానే ప్రయత్నిస్తున్నది. కొన్ని స్థానాల్లో బలమైన అభ్యర్థులను పోటీలో దింపింది.

రైతు వేషంలో జిల్లా కలెక్టర్

- ధాన్యం సేకరణ కేంద్రంలో అక్రమాల గుట్టురట్టు
- రైతులను మోసం చేస్తున్న అధికారికి షోకాజ్ నోటీసు

భద్రక్: కలెక్టర్ మారువేషంలో వెళ్లి అక్రమార్కుల గుట్టురట్టు చేసే సీన్‌లు సినిమాల్లో చూస్తుంటాం. ఒడిశాలోని భద్రక్ జిల్లా కలెక్టర్ దిలీప్ రౌత్రాయ్ నిజజీవితంలో ఈ పని చేసి, అక్రమార్కులకు వణుకు పుట్టించారు. ఓ ధాన్యం సేకరణ కేంద్రంలో అక్రమాలను గుర్తించి, చర్యలు చేపట్టారు. వరి సేకరణ కేంద్రాల్లో పంట దిగుబడిలో నాణ్యత లేదని పేర్కొంటూ తమకు తక్కువ ధర ఇస్తున్నారని రైతులు ఫిర్యాదులు చేస్తున్నారు. దీంతో తానే స్వయంగా వెళ్లాలని కలెక్టర్ నిర్ణయించారు. ధామ్‌నగర్ బ్లాక్‌లోని కాటాసాహి మండీలోని ధాన్యం సేకరణ కేంద్రానికి రైతు వేషధారణలో వెళ్లారు. కొంత ధాన్యాన్ని విక్రయించేందుకు కాంటాకు వెశారు. అయితే, వృథా సాకుతో 8 కిలోలకు డబ్బులు తక్కువ ఇస్తానని అధికారి చెప్పాడు. సదరు అధికారికి షోకాజ్ నోటీసు ఇచ్చినట్టు కలెక్టర్ తెలిపారు.

'ఆత్మహత్యల్లో 72% పురుషులవే'

న్యూఢిల్లీ: గృహ హింస, వేధింపుల చట్టాలు ఆడవారికైనా, మగవారికైనా ఒకేలా ఉండాలని బీజేపీ ఎంపీ దినేశ్ శర్మ కోరారు. పురుషుల ఆత్మహత్యలపై సోమవారం ఆయన రాజ్యసభలో ఆందోళన వ్యక్తం చేశారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో లెక్కల ప్రకారం 2022లో ఆత్మహత్యలతో మరణించిన వారిలో 72 శాతం పురుషులేనని చెప్పారు. 47 వేల మంది మహిళలు ఆత్మహత్య చేసుకున్నట్టు చెప్పారు. 2014 నుంచి 2021 మధ్య కాలంలో కుటుంబ సమస్యలతో ఆత్మహత్యలు చేసుకున్న పురుషుల సంఖ్య 107.5 శాతం పెరిగిందని తెలిపారు. 'గృహ హింస, వేధింపుల నుంచి మహిళలను కాపాడటంలో మన చట్టాలు పురోగతి సాధించాయి. ఇలాంటి చట్టాలు పురుషులను రక్షించడానికి లేకపోవడమే ఆందోళనకరం' అని ఆయన పేర్కొన్నారు. తప్పుడు ఆరోపణలు ఎదుర్కొంటున్న పురుషులకు న్యాయపరమైన, భావోద్వేగ మద్దతు లభించడం లేదని చెప్పారు.

తండ్రి మృతదేహం సగం కోసివ్వమన్నాడు!

- అంత్యక్రియల్లో గొడవ చేసిన అన్న
- పోలీసుల జోక్యంతో పరిష్కారం

టీకంగఢ్: తండ్రికి అంత్యక్రియలు నిర్వహించే విషయంలో తమ్ముడితో తలెత్తిన వివాదం కారణంగా తండ్రి మృతదేహంలో సగ భాగాన్ని కోసి ఇవ్వాలని ఓ కొడుకు డిమాండ్ చేసిన ఉదంతం మధ్యప్రదేశ్‌లో వెలుగు చూసింది. టీకంగఢ్ జిల్లా లిధోర తాల్ గ్రామంలో ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన ధైనీ సింగ్ ఘోష్(84) అనే వ్యక్తి తన చిన్న కొడుకు దేశ్ రాజ్ వద్ద నివసిస్తూ ఆదివారం మృతి చెందాడు. ఈ విషయం తెలిసి గ్రామం బయట నివసిస్తున్న అతడి పెద్ద కొడుకు కిషన్ తమ్ముడి ఇంటికి వచ్చాడు. తండ్రి అంత్యక్రియలను తానే నిర్వహిస్తానని పట్టుబట్టాడు. అయితే తాను అంత్యక్రియలు నిర్వహించాలన్నది తన తండ్రి చివరి కోరికని దేశ్‌రాజ్ అన్నకు తెలిపాడు. దీంతో తమ్ముడితో గొడవకు దిగిన కిషన్ తండ్రి శరీరాన్ని సగం కోసి తనకు ఇవ్వాలన్నాడు. గ్రామస్థులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి కిషన్‌కు సర్ది చెప్పడంతో అతడు అక్కడ నుంచి వెళ్లిపోయాడు. దేశ్‌రాజ్ తన తండ్రి దహన సంస్కారాలు నిర్వహించారు.

దివ్యాంగులంతా పరీక్షల్లో స్క్రైబ్ సహాయం తీసుకోవచ్చు

- బెంచ్ మార్క్ వైకల్యంతో సంబంధం లేదు
- సుప్రీంకోర్టు తీర్పు.. మార్గదర్శకాలు జారీ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: ఇక నుంచి దివ్యాంగులంతా పరీక్షలు రాయడానికి స్క్రైబ్‌ల సహాయాన్ని తీసుకోవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. 40 శాతం నిర్దిష్ట వైకల్యం(బెంచ్‌మార్క్) ఉందా, లేదా అనే అంశంతో సంబంధం లేకుండా స్క్రైబ్ సహాయం పొందవచ్చని తెలిపింది. బెంచ్‌మార్క్ వైకల్యం ఉన్న వ్యక్తులకు ఉండే ప్రయోజనాలను పరిమితులు లేకుండా పీడబ్ల్యూడీ అభ్యర్థులు అందరికీ అమలు చేయాలని స్పష్టం చేసింది. గుల్షన్ కుమార్ అనే వ్యక్తి దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారించిన జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ ఆర్ మహదేవన్ ధర్మాసనం ఈ మేరకు సోమవారం కీలక తీర్పు వెలువరించింది. కేంద్రానికి పలు మార్గదర్శకాలను సైతం జారీ చేసింది. వీటిని రెండు నెలల్లో అమలు చేయాలని ఆదేశించింది.

కేంద్రానికి మార్గదర్శకాలు

- బెంచ్‌మార్క్ వైకల్యం ఉన్న వారికి ఉండే అన్ని ప్రయోజనాలను ఎలాంటి పరిమితులు విధించకుండా దివ్యాంగులైన(పీడబ్ల్యూడీ) అభ్యర్థులు అందరికీ వర్తింపజేయాలి.
- 2022 ఆగస్టు 10న జారీ చేసిన ఆఫీస్ మెమోరాండంను పునఃపరిశీలించాలి. ఆంక్షలను తొలగించి సహేతుక పద్ధతిలో సడలింపులు ఇవ్వాలి.
- అభ్యర్థులు కేంద్రాన్ని సంప్రదించేందుకు వీలుగా ఫిర్యాదుల పరిష్కార పోర్టల్‌ను ఏర్పాటు చేయాలి.
- దరఖాస్తు చేసిన తర్వాత స్క్రైబ్ సర్టిఫికెట్ చెల్లుబాటును పొడిగించాలి.
- అభ్యర్థులు స్క్రైబ్‌తో పరిచయం చేసుకోవడానికి పరీక్షకు ముందే సమయం ఇవ్వాలి.

కస్టమర్ల ఫోన్ నంబర్లను దుకాణదారులు తీసుకోరాదు

వినియోగదారుల కమిషన్ తీర్పు

చండీగఢ్: రిటైల్ దుకాణదారులు వినియోగదారుల ఫోన్ నంబర్లను తీసుకోరాదని రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్, చండీగఢ్ బెంచ్ తీర్పు చెప్పింది. అడ్వకేట్ పంకజ్ చంద్‌గోథియా ఫిర్యాదుపై విచారణ సందర్భంగా ఈ తీర్పునిచ్చింది. తాను 2024 ఏప్రిల్‌లో చెప్పులు కొన్నానని, దుకాణదారు బిల్లు ఇస్తాననే నెపంతో తన ఫోన్ నంబరును తీసుకున్నారని చెప్పారు. ఇది సమాచార గోప్యత నిబంధనల ఉల్లంఘన అని వాదించారు. విలువలు పాటించనివారికి తన సమాచారం అందుబాటులో ఉందన్నారు. వినియోగదారుల శాఖ 2023 మే 26న జారీ చేసిన నోటిఫికేషన్‌లో, ఓ ఉత్పత్తిని అమ్మేటపుడు, ఫోన్ నంబర్లను చెప్పాలని కస్టమర్లను అడగటం, దానిని తప్పనిసరి అవసరంగా చెప్పటం, కస్టమర్ల హక్కుల ఉల్లంఘన అవుతుందని చెప్పినట్టు తెలిపారు. దీనిపై బెంచ్ తీర్పు చెప్తూ, తక్షణమే పంకజ్‌కు సంబంధించిన వ్యక్తిగత సమాచారాన్ని తొలగించాలని ఆదేశించింది. నష్టపరిహారంగా రూ.2,500 చెల్లించాలని తెలిపింది.

ఫోర్బ్స్ శక్తిమంతమైన దేశాల జాబితా

12వ స్థానంలో భారత్

న్యూయార్క్: 2025 సంవత్సరానికి గానూ ప్రపంచంలోని శక్తిమంతమైన దేశాల జాబితాను ఫోర్బ్స్ విడుదల చేసింది. ఈ జాబితాలో అమెరికా మొదటి స్థానంలో నిలిచింది. రెండు, మూడు స్థానాల్లో చైనా, రష్యాకు చోటు దక్కింది. ఆ తర్వాత వరుసగా యూకే, జర్మనీ, దక్షిణ కొరియా, ఫ్రాన్స్, జపాన్, సౌదీ, ఇజ్రాయెల్ నిలిచాయి. కాగా, జనాభాలో మొదటి స్థానం, సైనిక శక్తిలో నాలుగో స్థానంలో ఉన్నా టాప్-10లో భారత్‌కు చోటు దక్కలేదు. జాబితాలో భారత్‌కు 12వ స్థానం దక్కింది.